ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 తమిళనాడు TAMILNADU
శనివారం 7 సెప్టెంబరు 2024

చవితి పూజలకు సర్వంసిద్ధం

ప్యారీస్, సెప్టెంబరు 6: శివపార్వతుల జేష్ఠ పుత్రుడు విఘ్నేశ్వరుడి కటాక్షం కోసం ప్రత్యేక పూజలకు రాష్ట్రం సర్వాంగసుందరంగా ముస్తాబైంది. శనివారం వినాయక చవితి పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. చవితికి సంబంధించి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం, పర్యావరణ శాఖల సూచనల మేరకు బంకమట్టితో తయారుచేసిన బుల్లి గణపతి ప్రతిమలను కొనుగోలు చేసి తమ నివాసాల్లో పూజించనున్నారు. ఈ ఏడాది కూడా పోలీసు శాఖ అనుమతించిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో గణనాథుడి ప్రతిమలు కనువిందు చేస్తున్నాయి. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు వీధివీధినా రకరకాల భంగిమలతో కళాకారులు రూపొందించిన లంబోదరుడి విగ్రహాలను కొలువుదీర్చారు. పర్యావరణానికి నష్టం వాటిల్లకుండా మట్టి గణపతిని పూజిద్దామన్న నినాదంతో భక్తులు పండుగ జరుపుకుంటున్నారు. చవితి వేడుకలు నిర్వహిస్తున్న కమిటీలు నిబంధనలు పాటించి ఐదు రోజులు పూజలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఇతర మతాలకు భంగం కలుగకుండా గణపయ్య ప్రతిమల ఊరేగింపు, నిమజ్జనాలు నిర్వహించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనం రోజు వరకు వినాయకుడి ప్రతిమలు ప్రతిష్ఠించిన వీధులు సందడి చేయనున్నాయి. కాగా, రాజధాని నగరం చెన్నైలో 1,519 వినాయకుడి ప్రతిమలను ప్రతిష్ఠించారు. ఈ ప్రాంతాల్లో పోలీసు శాఖ ఉత్తర్వుల మేరకు సీసీ కెమెరాలు పొందుపరిచారు. శివగంగ జిల్లా పిళ్లయార్‌పట్టిలో విఘ్నేశ్వరుడికి నైవేద్యంగా నివేదించేందుకు లడ్డు ప్రసాదం తయారు చేశారు. అదే విధంగా తిరుచ్చి పట్టణంలో కోట గుమ్మంపై కొలువై ఉన్న ఉచ్చుపిళ్లయార్ ఆలయంలో చవితి పండుగను ఈ ఏడాది 9 రోజులు కోలాహలంగా నిర్వహించనున్నారు. స్వామివారికి 150 కిలోలతో తయారుచేసిన కుడుమును నైవేద్యంగా నివేదించనున్నారు.




మార్కెట్లో సిద్ధంగా బుజ్జి బుజ్జి గణనాథులు


గణపతికి హారతినిస్తున్న విద్యార్థినులు


లంబోదరుడికి విద్యార్థినుల పూజలు


ప్రత్యేక అలంకరణలో విఘ్నేశ్వరుడు

నేతల శుభాకాంక్షలు... : వినాయక చవితి పండుగ జరుపుకుంటున్న రాష్ట్ర ప్రజలకు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజల జీవితాల్లో కష్టాలు తొలిగి సుఖాలు కలగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఈపీఎస్ పేర్కొన్నారు. వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగిపోతాయ న్నారు. అలాగే, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, బీజేపీ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ సహా పలు పార్టీల నేతలు ప్రజలకు వేర్వేరు ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

రౌడీల వేట కొనసాగుతుంది

- గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం
- 2 నెలల్లో 150 మంది నేరస్తులపై గూండా చట్టం
- నగర పోలీస్ కమిషనర్ అరుణ్ వెల్లడి


అరుణ్

అడయార్, సెప్టెంబరు 6: నగరంలో రౌడీల వేట కొనసాగుతోందని, గంజాయి వంటి మత్తుపదార్థాల విక్రయాలను నిర్మూలిస్తామని నగర పోలీస్ కమిషనర్ అరుణ్ ప్రకటించారు. ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడుతూ... బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకేసు విచారణ 90 శాతం పూర్తయిందని, త్వరలోనే చార్జిషీటు దాఖలు చేస్తామని తెలిపారు. ఈ కేసులో అరెస్టు చేసిన నిందితుల ఆస్తులు జప్తు చేసేందుకు అసిస్టెంట్ కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే, ఈ హత్య కేసుతో సంబంధం ఉన్న కీలక నేతల వివరాలను త్వరలోనే హైకోర్టుకు తెలియజేస్తామన్నారు. నగరంలో కాలేజీ విద్యార్థుల 'రూట్ తల' అంశం పెద్ద వివాదంగా మారిందన్నారు. సినీ ఫక్కీలో టాప్‌లపై ఎక్కి డ్యాన్సులు వేయడం, ఇతర ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేసేలా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇలాంటి వారిని గుర్తించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బృందం పోలీసులు సివిల్ దుస్తుల్లో నిఘా వేసి పోకిరి విద్యార్థులను గుర్తించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. తాను కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన 2 నెలల్లో 150 మంది రౌడీలపై గూండా చట్టం ప్రయోగించినట్టు తెలిపారు. అనేక మంది రౌడీలు నగరం వీడి వెళ్లిపోయారన్నారు. చెన్నైలో గంజాయి వంటి మత్తుపదార్థాల విక్రయాల్ని అరికట్టడమే కాకుండా, నిర్మూలించేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందులోభాగంగా గంజాయి స్మగ్లర్లు, వ్యాపారులు, పెడ్లర్లు, కొనుగోలుదారులను గుర్తించేందుకు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సారథ్యంలో కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్‌లో సుదీర్ఘంగా పనిచేస్తున్న వారిని గుర్తించి బదిలీ చేసి, వారి స్థానాల్లో కొత్తవారిని నియమిస్తామన్నారు. ఇలా చేయడం వల్ల కేసుల విచారణ త్వరితగతిన సాగుతుందని కమిషనర్ అరుణ్ వెల్లడించారు.

లింకన్ ఎలక్ట్రిక్ సహా 3 కంపెనీలతో ఒప్పందాలు

- ఒకే రోజు రూ.850కోట్ల పెట్టుబడుల సమీకరణ
- చెంగల్పట్టు, కంచి, కోవై, చెన్నైలో పరిశ్రమలు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో భాగంగా ప్రస్తుతం చికాగో నగరంలో పర్యటిస్తున్న సీఎం ఎంకే స్టాలిన్ గురువారం రాత్రి లింకన్ ఎలక్ట్రిక్ కంపెనీ సహా మూడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు గల అవకాశాలు, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు గురించి వారికి వివరించారు. సుమారు గంటకు పైగా జరిగిన ఈ చర్చలు ఫలించాయి. దీంతో మూడు కంపెనీల ప్రతినిధులు రూ.850 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టేందుకు స్టాలిన్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వెల్డింగ్ వస్తువులు, పరికరాల తయారీలో ఖ్యాతిగడించిన లింకన్ ఎలక్ట్రిక్ సంస్థ రాష్ట్రంలో రూ.500 కోట్లతో చెంగల్పట్టులో కర్మాగారాన్ని, లింకన్ ఎలక్ట్రిక్స్ పరిశోధన అభివృద్ధి కేంద్రాన్ని విస్తరింపజేయడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివపాదసుందరం ఖాజా, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గ్రెగరీ డొరియా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇదే విధంగా సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్ కాంపొనెంట్ల తయారీలో పేరుగడించిన విషయ్ ప్రెసిషెన్ కంపెనీ రూ.100 కోట్లతో కాంచీపురం వద్ద సెన్సార్లు, ట్రాన్స్‌డ్యూసర్స్ ఉత్పి కర్మాగారాన్ని నెలకొల్పటానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంపై కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్) స్టీఫెన్ క్రివర్ సంతకం చేశారు. ఇక ఫోర్డ్, జనరల్ మోటర్స్, బీఎండబ్ల్యూ, ఫోక్స్‌వేగన్ కంపెనీలకు ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్ వస్తువులను పంపిణీ చేస్తున్న ప్రఖ్యాత విస్టియాన్ కంపెనీ చెన్నై, కోయంబత్తూరు నగరాల్లో రూ.250 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఉత్పత్తి కర్మాగారం స్థాపించేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విస్టియాన్ కంపెనీ సీఈఓ సచిన్ లావెండీ, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఫ్రాన్సిస్ కిమ్, డైరెక్టర్ రేయాన్ కచారి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ మూడు ప్రత్యేక కార్యక్రమాల్లో పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా, పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ కార్యదర్శి అరుణ్‌రాయ్, మార్గదర్శక విభాగం మేనేజింగ్ డైరెక్టర్ విష్ణు తదితర అధికారులు పాల్గొన్నారు.


చికాగోలో గురువారం రాత్రి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్న లింకన్ ఎలక్ట్రిక్ కంపెనీ ప్రతినిధులు

ఇద్దరు మంత్రులకు ఊరట

- అక్రమాస్తుల కేసుల విచారణపై సుప్రీంకోర్టు స్టే


మంత్రులు తంగం తెన్నరసు, రామచంద్రన్

పెరంబూర్, సెప్టెంబరు 6: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న కేసులో మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు తదితరులపై ఉన్న కేసులను దిగువ కోర్టు మళ్లీ విచారించాలనే హైకోర్టు ఉత్తర్వులకు సుప్రీంకోర్టు స్టే విధించింది. 2006 నుంచి 2011 వరకు డీఎంకే ప్రభుత్వంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించిన కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఆయన భార్య ఆదిలక్ష్మి, స్నేహితుడు కేఎస్‌పీ షణ్ముగమూర్తికి వ్యతిరేకంగా ఆదాయానికి మించి రూ.44,56,067 ఆస్తులు కూడబెట్టారంటూ 2012లో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసింది. శ్రీ విల్లిపుత్తూర్ సెషన్స్ కోర్టులో ఈ కేసు విచారణ జరుగుతుండగా, ఈ కేసు నుంచి తమను విడిపించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విచారించిన సెషన్స్ కోర్టు, వారిని విడిపిస్తూ 2023 జూలై 20వ తేది ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ సుమోటా కేసుగా నమోదు చేసి విచారణకు ఆదేశించారు. రామచంద్రన్ కేసు మాత్రమే కాకుండా ఇలాంటి కేసులో విడుదలైన మంత్రి తంగం తెన్నరసు, ఆయన భార్య ఆదాయానికి మించి రూ.76.40 లక్షలు కూడబెట్టారనే కేసులో దిగువ న్యాయస్థానం వారిని విడుదల చేసింది. కేసుల నుంచి ఇద్దరు మంత్రులు విడుదల చేయాలనే దిగువ కోర్టు ఉత్తర్వులు రద్దు చేసి మళ్లీ విచారణ చేపట్టాలని ఈ నెల 7వ తేది మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జారీచేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ మంత్రులు రామచంద్రన్, తంగం తెన్నరసులు సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్లు దాఖలుచేశారు. వాటిని శుక్రవారం విచారించిన సుప్రీంకోర్టు, మంత్రులు రామచంద్రన్, తంగం తెన్నరసు, వారి కుటుంబ సభ్యులపై నమోదైన కేసును దిగువ కోర్టు మళ్లీ విచారించాలనే మద్రాసు హైకోర్టు ఉత్తర్వులకు తాత్కాలిక స్టే విధించింది. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు రిజిస్ట్రార్లు నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది.

పాఠశాలలో వివాదాస్పద ప్రసంగం

- సీఎం స్టాలిన్ ఆగ్రహం
- హెడ్మాస్టర్‌పై బదిలీ వేటు
- ఇక ప్రవచనాలకు అనుమతి తప్పనిసరి


ప్రధానోపాధ్యాయురాలు తమిళరసి, మహావిష్ణు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అశోక్‌నగర్ ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల విద్యార్థినుల్లో మూఢనమ్మకాలను కలిగించే రీతిలో ఏర్పాటు చేసిన ప్రసంగ కార్యక్రమం వివాదాస్పదంగా మారింది. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం స్టాలిన్ ఈ విషయంపై దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ఆ ప్రసంగంపై పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులతో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఇకపై విద్యా సంస్థలలో మూఢనమ్మకాలను కలిగించే ప్రసంగ కార్యక్రమాలు జరపకుండా కొత్త విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. దీనిపై స్పందించిన పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి విచారణకు ఉత్తర్వులు జారీ చేసి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని బదిలీ చేశారు.

దివ్యాంగులను కించపరిచేలా...

మూడు రోజులకు ముందు అశోక్‌నగర్ పాఠశాలలో విద్యార్థులలో ఆత్మవిశ్వాసం కలిగించే విధంగా మహావిష్ణు అనే వ్యక్తి ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆ ప్రసంగంలో ఉన్నట్టుండి పాపపుణ్యాలు, ముందు జన్మ విశేషాలు, గురుకుల విద్యా బోధన, మరుజన్మ, మానవుల మధ్య భగవంతుడు తారతమ్యాలను ఏర్పాటు చేయడానికి గల కారణాల గురించి వివరించారు. అదే సమయంలో దివ్యాంగులను కించపరిచేలా కొన్ని వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ ప్రసంగాన్ని వింటున్న ఉపాధ్యాయుడు శంకర్ నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థినులలో మూఢ నమ్మకాలు కలిగించేలా ప్రసంగం కొనసాగుతోందని, ఇంతటితో ఆపాలంటూ హెచ్చరించారు. అయినా మహావిష్ణు పట్టించుకోకుండా ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ సంఘటనలన్నీ మరుసటి రోజు నుంచి సామాజిక ప్రసార మాధ్యమాల్లో వెలువడి తీవ్ర కలకలం రేపింది. మహావిష్ణు ప్రసంగం విద్యార్థినుల్లోమూఢ నమ్మకాలను ప్రేరేపించే విధంగా ఉందని, ఆ ప్రసంగాన్ని ఎలా అనుమతించారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆ వీడియోను చూసి పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ మహావిష్ణు ప్రసంగాన్ని ధైర్యంగా అడ్డుకున్న ఉపాధ్యాయుడు శంకర్‌ను పిలిపించి ప్రశంసించారు. మూఢనమ్మకాలు కలిగించేలా ప్రసంగించిన మహావిష్ణును ఊరికే వదలిపెట్టనని హెచ్చరించారు. అదే సమయంలో మహావిష్ణు వివాదాస్పద ప్రసంగం గురించి అమెరికా పర్యటలో ఉన్న స్టాలిన్ తెలుసుకుని తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మూఢ నమ్మకాలను ప్రేరేపించేలా, దివ్యాంగులను కించపరిచేలా ప్రసంగ కార్యక్రమాన్ని ఎలా కొనసాగించారంటూ మండిపడ్డారు. జరిగిన సంఘటనపై సమగ్రంగా విచారణ జరుపమంటూ ఆదేశాలిచ్చారు. భవిష్యత్ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపైనే ఉందని, వారిలో మేధోపరిజ్ఞానాన్ని పెంపొందింపజేయాలే తప్ప వారి మనస్సులో మూఢనమ్మకాలను పాతుకునేలా చేయకూడదంటూ స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ప్రకటన జారీ చేశారు. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో విద్యకు సంబంధించని ప్రసంగాలు, కార్యక్రమాలను అనుమతి లేకుండా నిర్వహించకూడదని, ఈ ఉత్తర్వు తక్షణమే అమలులోకి వస్తుందని పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి మధుమతి ప్రకటించారు.


మహావిష్ణు ప్రసంగాన్ని అడ్డుకున్న ఉపాధ్యాయుడు శంకర్‌ను అభినందిస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

రాందాస్ ఆగ్రహం..

అశోక్‌నగర్ పాఠశాలలో విద్యార్థినులలో మూఢనమ్మకాలను కలిగించేలా ప్రసంగించిన ప్రవచనకర్త మహావిష్ణును అరెస్టు చేయాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే ఆధ్యాత్మిక ప్రవచనాలు వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించేలా ఉండాలే తప్ప వారిలో భయాన్ని, మూఢ నమ్మకాలను కలిగించే రీతిలో ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ఇకపై ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు జరగకుండా పాఠశాలల విద్యాశాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రధానోపాధ్యాయురాలిపై బదిలీ వేటు..

వివాదాస్పదమైన ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు అశోక్‌నగర్ బాలికల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తమిళరసిపై బదిలీవేటు పడింది. ఈ మేరకు ఆమెను తిరువళ్లూరుకు బదిలీ చేస్తూ పాఠశాలల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ పొయ్యామొళి ఉత్తర్వులు వెలువరించారు. తిరువళ్లూరు జిల్లా కోవిల్‌పతాగై ప్రభుత్వ మహోన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఆమె నియమితులయ్యారు. ఇదిలా ఉండగా అశోక్‌నగర్ పాఠశాలలో ప్రసంగం చేసిన మహావిష్ణు అంతకు మునుపు సైదాపేట పాఠశాలలోనూ ప్రసంగం చేసినట్లు విద్యాశాఖ అధికారుల విచారణలో వెల్లడైంది. దీనితో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షణ్ముగసుందరంపై కూడా బదిలీ వేటు పడింది. షణ్ముగసుందరం చెంగల్పట్టు జిల్లా ఆనైకట్టు పాఠశాలకు బదిలీ అయ్యారు.

సమాచార దర్శిని

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సెలవు

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: వినాయక చవితి సందర్భంగా శనివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పని చేయవని ఆ శాఖ అధ్యక్షుడు దినేష్ పొన్‌రాజ్ ఆలీవర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కువ పత్రాలు రిజిస్ట్రేషన్ అయ్యే 100 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇదివరకు శనివారాలు కూడా పనిచేసేవి. ఈ నేపథ్యంలో, రిజిస్ట్రేషన్ శాఖ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో... వినాయక చవితిని పురస్కరించుకొని 100 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 7వ తేది సెలవు ప్రకటించామని తెలిపారు.

డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25నుంచి 27వ తేదీ వరకు డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగల్ సిడ్కో ఎస్టేట్ సమీపంలో ఉన్న ఈ సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు జరిగే శిక్షణలో ఆసక్తి ఉన్న 18 ఏళ్ల పైబడిన టెన్త్ ఉత్తీర్ణులైన వారుపాల్గొనవచ్చు. వివరాలకు నెం.044-22252081, 8668100181లలో సంప్రదించవచ్చు.

నేడు ఆదివారం టైంటేబుల్‌తో సబర్బన్ రైళ్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: వినాయక చవితిని పురస్కరించుకొని ఆదివారం టైం టేబుల్ ప్రకారం సబర్బన్ రైళ్లు నడుస్తాయని దక్షిణ రైల్వే తెలిపింది. ఆ ప్రకారం, శనివారం చెన్నై సెంట్రల్ - అరక్కోణం, చెన్నై సెంట్రల్ - గుమ్మిడిపూండి - సూళ్లూరుపేట, చెన్నై బీచ్ - చెంగల్పట్టు మార్గాల్లో ఆదివారం టైం టేబుల్ ప్రకారం రైళ్లు నడవనున్నాయి.

24న మద్రాసు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: మద్రాసు విశ్వవిద్యాలయ 166వ స్నాతకోత్సవం ఈనెల 24వ తేది జరగనుంది. పీహెచ్‌డీ పట్టభద్రులు స్వయంగా పట్టాలు పొందేలా దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. వర్సిటీ సమాచార కేంద్రంలో రూ.25 చెల్లించి దరఖాస్తు పొందవచ్చు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 14వ తేదిలోపు సమర్పించాలి. స్నాతకోత్సవ ఏర్పాట్లను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఏలుమలై ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

తిరుచెందూర్ - నెల్లై ప్యాసింజరు రైలు 25 రోజులు రద్దు

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: తిరుచెందూర్ - తిరునల్వేలి ప్యాసింజర్‌ను 25 రోజులు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. తిరునల్వేలి జంక్షన్ నుంచి ప్రతిరోజు తిరుచెందూర్‌కు ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. ఇవి మినహా చెన్నైకు నడిచే తిరుచెందూర్ ఎక్స్‌ప్రెస్, కేరళ రాష్ట్రం పాలక్కాడుకు పాలరువి ఎక్స్‌ప్రెస్ వంటివి కూడా ఈ మార్గంలో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, నెల్లై జంక్షన్ రైల్వేస్టేషన్ యార్డు పునరుద్ధరణ పనులు ప్రారంభం కానున్నాయి. దీంతో పనులకు అంతరాయం కలగకుండా నెల్లై - తిరుచెందూర్ మధ్య ప్యాసింజర్ సేవలు రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మెట్రో పార్కింగ్‌కు 10 ఎకరాల స్థలం

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: మెట్రో పార్కింగ్ కోసం 10 ఎకరాల స్థలాన్ని సీఎంఆర్ఎల్ ఎంపిక చేసింది. స్థానిక ఆలందూర్, విమానాశ్రయం, సైదాపేట, థౌజండ్ లైట్స్ వంటి మెట్రో రైల్వేస్టేషన్లలో ఉదయం 10 గంటలకే పార్కింగ్ ఫుల్ అనే బోర్డులు ఉంచుతున్నారు. దీంతో అదనపు పార్కింగ్ స్థలాల ఎంపికకు సీఎంఆర్ఎల్ చర్యలు చేపట్టింది. ఆ ప్రకారం, కోయంబేడు, బట్ రోడ్డు, పూందమల్లి బైపాస్, షోలింగనల్లూర్, సిరుచ్చేరి, పోరూరు, తిరుమంగళం వంటి వివిధ ప్రాంతాల్లో 10 ఎకరాల్లో పార్కింగ్ వసతి కల్పించేలా స్థలాలు ఎంపిక చేసింది.

1.5 లక్షల ప్రాంతాల్లో వినాయక ప్రతిమల ఏర్పాటు

హిందు మున్నని

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: రాష్ట్రంలో 1.5 లక్షల ప్రాంతాల్లో వినాయక ప్రతిమలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రతిష్ఠించనున్నట్లు హిందు మున్నని అధ్యక్షుడు కాటేశ్వర సుబ్రమణ్యం తెలిపారు. తిరుప్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... వినాయక చవితిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా ప్రతిమల ఏర్పాటుకు పోలీసు శాఖ అనుమతి పొందామన్నారు. 3, 5, 10 అడుగుల ఎత్తు విగ్రహాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. వ్యక్తిగతంగా గృహాల్లో 15 లక్షల మంది ప్రజలు చిన్న ప్రతిమలను పూజించనున్నారని తెలిపారు. తిరుప్పూర్‌లో 4వ రోజు, కోవైలో 5వ రోజు ప్రతిమలను ఊరేగించి నిమజ్జనం చేయనున్నామని తెలిపారు. ఈ ఊరేగింపులో కేంద్రమంత్రి ఎల్.మురుగన్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

త్వరలో డీఎంకే కూటమిలో చీలికలు!

● బీజేపీ నేత హెచ్ రాజా జోస్యం

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో త్వరలోనే చీలికలు వస్తాయని బీజేపీ సమన్వయ కమిటీ రాష్ట్ర నేత హెచ్ రాజా జోస్యం చెప్పారు. డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, డీపీఐ తదితర మిత్రపక్షాలన్నీ మనస్పర్థలతో కొట్టుమిట్టాడుతున్నాయని, కూటమికి నాయకత్వం వహిస్తున్న డీఎంకే అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నాయన్నారు. తన అంచనా ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లోగా డీఎంకే కూటమిలో చీలికలు ఏర్పడటం ఖాయమన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ కూటముల్లో మార్పులు ఉంటాయని ఆయన చెప్పారు.

వయనాడు విషాదం

రాష్ట్ర సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రూ.36 లక్షల విరాళం

పెరంబూర్, సెప్టెంబరు 6: వయనాడు విపత్తుల నివారణ నిధిగా సీపీఎం తమిళనాడు తరఫున రూ.35.97 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యదర్శి కె.బాలకృష్ణన్ విడుదల చేసిన ప్రకటనలో... కేరళ రాష్ట్రం వయనాడులో కురిసిన అతిభారీ వర్షాలకు మట్టిచెరియలు విరిగిపడిన ఘటనలో బాధితులను ఆదుకొనేలా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు రాష్ట్ర కమిటీ తరఫున గత నెలలో రూ.10 లక్షలు అందించామన్నారు. వయనాడు బాధితులను ఆదుకొనేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి సేకరించిన విరాళం రూ.37,97,611ను పార్టీ కేంద్ర కమిటీకి పంపినట్లు కె.బాలకృష్ణన్ తెలిపారు.






కొబ్బరి మట్ట, ఆకులతో రూపొందించిన ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు - మట్టి గణపయ్య

కనువిందు చేసిన 'ఎకో ఫ్రెండ్లీ' వినాయకులు



కూరగాయలు, చాక్లెట్లతో..

ప్యారీస్, సెప్టెంబరు 6: వాయు, శబ్దకాలుష్యాలు విపరీతంగా పెరిగి అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజలను మట్టి గణపతినే పూజించాలన్న సంకల్పంతో చెన్నైలోని మహిళా కళాశాల విద్యార్థినులు శుక్రవారం 'ఎకో ఫ్రెండ్లీ' వినాయక చవితిని కోలాహలంగా జరుపుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో ప్రకృతి సిద్ధమైన పదార్థాలతో రూపొందించిన వినాయక ప్రతిమలకు అన్నానగర్‌లోని వల్లియమ్మాళ్ మహిళా కళాశాలలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వయంగా విద్యార్థులు ఆకులు, పండ్లు, పుష్పాలు, పత్రాలతో రకరకాల ఆకృతులతో రూపొందించిన గణనాథుడికి పూజలు నిర్వహించి సందడి చేశారు. పండ్లు, పుష్పాలు, కూరగాయలతో అందంగా రూపొందించిన గణనాథుడి ఆకారాలను సందర్శించేందుకు విద్యార్థినులు ఉత్సాహం చూపారు.



పత్ర వినాయకుడు



వినాయక విగ్రహాలు తీసుకెళ్తున్న నిర్వాహకులు






ప్రపంచంలో ప్రశాంత వాతావరణం ఏర్పడాలని వినాయకుడి రూపాలతో విద్యార్థులు - కర్పగ వినాయకుడి సేవలో విద్యార్థినులు - వినాయక చవితి వేడుకల్లో క్రికెటర్‌గా వినాయకుడు - సిద్ధంగా వినాయక విగ్రహాలు

ఎస్ఆర్ఎం వర్సిటీలో బయో మెడిసిన్‌పై సదస్సు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముత్తమిళ్‌సెల్వన్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం శాస్త్ర సాంకేతిక సంస్థ (ఎస్ఆర్ఎంఐఎస్‌టి)లో బయో మెడిసిన్‌పై మూడు రోజులు అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. తైవాన్‌లోని నేషనల్ చుంగ్‌చెంగ్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహించిన ఈ సదస్సులో వైస్‌ఛాన్సలర్ డాక్టర్ సి.ముత్తమిళ్‌సెల్వన్, తైవాన్ వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ షా-జెంగ్ టిసాయ్ డైరెక్టర్ డాక్టర్ యంగ్ లుంగ్-జియె, డాక్టర్ రేవతి వెంకటరామన్, సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

30లోగా కూవం తీరంలో వ్యర్థాలు తొలగించండి

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: కూవం తీరంలో భవన నిర్మాణ వ్యర్థాలను ఈనెల 30వ తేదిలోగా తొలగించాలని సంబంధిత సంస్థకు జాతీయ రహదారుల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల చెన్నైలోని పలు ప్రాంతాల నుంచి భవన నిర్మాణ వ్యర్థాలను తీసుకొచ్చి కూవం తీరంలో పారబోస్తున్నారు. దీని వల్ల నది పూడిపోయి వర్షాలు కురిసినప్పుడల్లా నగరంలోకి భారీగా నీరు చేరుతోంది. అక్టోబరులో ఈశాన్య రుతుపవనాలకు ముందే ఈ వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఆవిన్ కేంద్రం పరిశీలన



ఆవిన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 6: స్థానిక సత్తువాచేరిలోని ఆవిన్ కేంద్రాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. పాల బిల్లింగ్ కేంద్ర మెషిన్, వెన్న తయారీ యంత్రాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, పాల ప్యాకెట్ల ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్, కేంద్రం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆవిన్ ఎండీ ఇళంగోవన్, జాయింట్ రిజిస్ట్రార్ గోపి, ఉప జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దుకాణాన్ని ప్రారంభించిన వీఐటీ ఛాన్సలర్



వేలూరు, సెప్టెంబరు 6: స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన సాయి సుప్రభాతం దుకాణాన్ని వీఐటీ యూనివర్సిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ జాయింట్ డైరెక్టర్ రాణిపేట క్యాంపస్ దీపక్ సెల్వరాజ్, వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్, సాయి సుప్రభాతం గ్రూప్ స్థాపకుడు మేతాగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ మాణిక్ ఠాగూర్ గెలుపునకు వ్యతిరేకంగా పిటిషన్

పెరంబూర్, సెప్టెంబరు 6: విరుదునగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపీ మాణిక్ ఠాగూర్ గెలుపు చెల్లదని ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఎన్నికల కమిషన్, మాణిక్ ఠాగూర్‌లు అఫిడవిట్లు దాఖలు చేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ముగిసిన పార్లమెంటు ఎన్నికల్లో విరుదునగర్ నియోకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన మాణిక్ ఠాగూర్ 4,379 ఓట్ల మెజార్టీతో డీఎండీకే అభ్యర్థి విజయప్రభాకరన్‌పై విజయం సాధించారు. మాణిక్ ఠాగూర్ గెలుపు చెల్లదని ప్రకటించాలని కోరుతూ విజయప్రభాకరన్ మద్రాసు హైకోర్టు ఎన్నికల కేసు దాఖలు చేశారు. పిటిషన్‌లో... మాణిక్ ఠాగూర్ తన నామినేషన్‌లో కొన్ని వివరాలు దాచారని, ఈ చర్యలు ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ పిటిషన్ శుక్రవారం న్యాయమూర్తి ఎన్.సతీష్‌కుమార్ విచారించారు. ఈ కేసులో అఫిడవిట్లు దాఖలుచేయాలని ఎన్నికల కమిషన్, మాణిక్ ఠాగూర్‌కు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణ అక్టోబరు 14వ తేదీకి వాయిదా వేశారు.

'ఉత్తమ ఉపాధ్యాయ' పురస్కారాల ప్రదానం



పురస్కారగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 6: ఇండియన్ రెడ్‌క్రాస్ సంఘం, కాట్పాడి శాఖ తరఫున ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా జరిగింది. స్థానిక కిలిత్తాన్‌పట్టరైలోని శివానందం ఎయిడెడ్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి అవై అధ్యక్షుడు జనార్దనన్ అధ్యక్షత వహించగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ శివవడివు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు రమేష్‌కుమార్ జైన్, రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తమంగా విధులు నిర్వహించిన ధనలక్ష్మి, శ్రీనివాసన్, వెంకటేశన్, ఎలిజబెత్, పూంపావై, అకిలన్, భాగ్యలక్ష్మి, వినోదిని, వనతి తదితర 13 మంది 'ఉత్తమ ఉపాధ్యాయుడు' పురస్కారం అందజేసి అభినందించారు.

విద్యా సహాయ నిధుల పంపిణీ



విద్యా సహాయాలు అందజేస్తున్న శక్తి అమ్మ

వేలూరు, సెప్టెంబరు 6: తిరుమలైకోడి ఓంశక్తి నారాయణి పీఠం, స్వర్ణాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉన్నత విద్య కోసం విద్యా సహాయ నిధులు పంపిణీ నారాయణి పీఠంలో జరిగింది. కార్యక్రమాన్ని మాజీ పోలీసు అధికారి బాలచందర్ జ్యోతి వెలిగించి ప్రారంభించగా వైద్య, ఇంజనీర్, వ్యవసాయ కళాశాలల్లో చదువుతున్న 600 మంది విద్యార్థినీ, విద్యార్థులకు రూ.1.50 కోట్ల విద్యా సహాయ నిధులను శక్తి అమ్మ అందించారు. కార్యక్రమంలో నారాయణి పీఠం మేనేజర్ సంపత్, స్వర్ణాలయం డైరెక్టర్ సురేష్‌బాబు, నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజి, నారాయణి పీఠం ట్రస్ట్ సభ్యుడు సౌందరరాజన్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులకు అండ... సీఐ ఇల్లు సహా 4 చోట్ల సీబీఐ తనిఖీలు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో భూకబ్జాదారులకు మద్దతుగా వ్యవహరించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నివాసగృహం సహా నాలుగు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం సీబీఐ అధికారులు తనిఖీలు జరిపారు. స్థానిక నుంగంబాక్కం పోలీసు స్టేషన్‌లో ఆనంద్‌బాబు సీఐ పనిచేస్తున్నారు. గతంలో ఆయనే నీలాంగరై పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్నప్పుడు కార్తీక్‌కి చెందిన భూములు కబ్జాకు గురయ్యాయి. ఆ కేసు విచారణలో ఆనంద్‌బాబు కబ్జాదారులకు మద్దతుగా వ్యవహరించారు. దీంతో కార్తీక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తన భూములను ఆక్రమించుకున్నవారికి అండగా నిలిచిన సీఐపై కఠిన చర్యలు తీసుకునేలా సమగ్రమైన విచారణకు ఆదేశించాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ఆదేశించడమే కాకుండా నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని ఉత్తర్వులిచ్చింది. దీంతో అన్నానగర్ పోలీసు క్వార్టర్స్‌లోని ఆనంద్‌బాబు నివాసగృహంలోను, ఆయనకు సంబంధించిన బిసెంట్‌నగర్, శాస్త్రినగర్, చోళింగనల్లూరుల్లో ఉన్న నివాసగృహాల్లో ఏకకాలంలో సీబీఐ అధికారులు సోదాలు జరిపారు. ఆనంద్‌బాబుపై ఆరోపణలపై విచారణ జరిపారు. సీఐ భూకబ్జా ఆరోపణలకు గురికావటం, ఆయనకు సంబంధించిన నాలుగు ఇళ్లలో చోట్ల ఒకే సమయంలో సీబీఐ అధికారులు తనిఖీలు జరపడం పోలీసు వర్గాలలో కలకలం రేపింది.

మహానాడుకు ఎలాంటి చిక్కుల్లేవ్... అనుమతివ్వండి

పోలీసులను కోరిన బుస్సీఆనంద్



వినతిపత్రం సమర్పిస్తున్న టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విక్రవాండిలో ఈనెల 23న తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడు స్థలానికి సంబంధించి ఎలాంటి చిక్కుల్లేవని, పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ విల్లుపురం పోలీసు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆ మహానాడు నిర్వహణకు ఆరు రోజుల ముందు అనుమతి కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. పోలీసులు ఆ మహానాడు నిర్వహణకు సంబంధించి 21 ప్రశ్నలతో నోటీసులు జారీ చేశారు. ఐదు రోజుల్లోగా ఆ ప్రశ్నలకు సరైన సమాధానాలతో నివేదికను సమర్పించాలని, అప్పుడే మహానాడుకు అనుమతి జారీ చేసే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆ నోటీసును అందుకున్న పార్టీ అధ్యక్షుడు విజయ్ న్యాయనిపుణులతో చర్చించి పోలీసులు అడిగిన 21 ప్రశ్నలకు ఆచితూచి సమాధానాలు రాశారు. ఆ సమాధానాలున్న వినతిపత్రాన్ని తీసుకుని ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ శుక్రవారం సాయంత్రం విల్లుపురం చేరి, అక్కడి పోలీసు ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ విలేకరులతో మాట్లాడుతూ మహానాడుకు పకడ్బందీ ఏర్పాటు చేపట్టామని, ఏయే ప్రాంతాల్లో ఎంత విస్తీర్ణంలో వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనుందీ తెలుపుతూ వినతిపత్రం సమర్పించామని, ఒకటి రెండు రోజుల్లో మహానాడుకు పోలీసులు తప్పకుండా అనుమతి జారీ చేయనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఢిల్లీ హాస్టల్‌లో చెన్నై విద్యార్థిని ఆత్మహత్య

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: ఢిల్లీ న్యాయ విశ్వవిద్యాలయం హాస్టల్‌లో చెన్నై విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఢిల్లీ ద్వారకాలో ఉన్న ఈ విశ్వవిద్యాలయంలో చెన్నై అయ్యపాక్కానికి చెందిన అమృతవర్షిణి (20) ఐదేళ్ల బీఏ., ఎల్.ఎల్.బీ కోర్సులో మూడో సంవత్సరం చదువుతోంది. హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న ఆమె బుధవారం తరగతులకు హాజరుకాలేదు. సహ విద్యార్థిని తరగతులు ముగిసిన తరువాత రూంకు వెళ్లి చూడగా తలుపు గొళ్లెం పెట్టి ఉంది. ఎంతసేపు తలుపు కొట్టినా తెరవకపోవడంతో అనుమానించి హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందించింది. సమాచారం అందుకున్న పోలీసులు హాస్టల్‌కు చేరుకుని తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా అమృతవర్షిణి ఉరేసుకుని మృతిచెందడం గమనించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

థియేటర్ బయట నిలిపిన వాహనాలకు జరిమానా

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: థియేటర్ వెలుపల నిలిపిన వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. విజయ్ నటించిన 'గోట్' సినిమా క్రోంపేట వెట్రి థియేటర్‌లో ప్రదర్శిస్తున్నారు. సినిమా చూసేందుకు వచ్చిన అభిమానులు తమ కార్లు, బైక్‌లను జీఎస్‌టీ రోడ్డులో రాకపోకలకు అంతరాయం కలిగించేలా నిలిపారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు 40 వాహనాలకు రూ.20,000 జరిమానా విధించారు.

విమానాశ్రయ మహిళా అధికారి ఆత్మహత్య



నిర్మల (ఫైల్ ఫొటో)

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: చెన్నై విమానాశ్రయంలో మహిళా అధికారి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మీనంబాక్కం విమానాశ్రయ కమిషనరేట్‌లో టెలిఫోన్ అనుసంధాన పర్యవేక్షకులుగా పనిచేస్తున్న నిర్మల గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. శుక్రవారం ఉదయం మరో మహిళా అధికారి వచ్చి చూడగా, నిర్మల ఆత్మహత్య చేసుకోవడాన్ని గమనించి దిగ్భ్రాంతి చెందారు. ఈ ఆత్మహత్యకు సంబంధించి పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో... నిర్మల మానసిక ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. ఈమె డిసెంబరులో ఉద్యోగవిరమణ పొందనుండడం గమనార్హం.

చెత్తకుండీలో ఆడ శిశువు

ఐసిఎఫ్, సెప్టెంబరు 6: స్థానిక నందనంలో చెత్తకుండీలో పడేసిన ఓ ఆడ శిశువును పోలీసులు రక్షించారు. సీఐటీ నగర్ సమీపంలో చెత్తకుండీలో నెల రోజుల వయసు కలిగిన శిశువు ఏడుస్తుండడాన్ని గుర్తించిన మెకానిక్ కలియపెరుమాళ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని శిశువును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడున్న సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించగా, ఓ యువతి శిశువును చెత్తకుండీలో పడేసి వెళ్లడాన్ని గుర్తించిన పోలీసులు ఆమె కోసం గాలిస్తున్నారు.

సిక్కింలో కారు ప్రమాదం

విరుదునగర్ జవాను మృతి

అడయార్, సెప్టెంబరు 6: సిక్కింలో జరిగిన కారు ప్రమాదంలో విరుదునగర్ జిల్లాకు చెందిన జవాను మృత్యువాతపడ్డారు. కన్నాపురానికి చెందిన తంగపాండ్యన్(41) 2004 నుంచి ఇండియన్ ఆర్మీలో పని చేస్తున్నారు. ఆయన గురువారం ఉదయం 11 గంటల సమయంలో కారులో వెళుతుండగా, రెనాక్ - రేంగలి జాతీయ రహదారిలో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తంగపాండ్యన్‌తో పాటు మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కాగా, తంగపాండ్యన్‌కు ఏడుగురు అక్కలు నలుగురు సోదరులు ఉండటం గమనార్హం. ఆయన మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు విచారంలో మునిగిపోయారు.

వంట గదిలో మానవ వ్యర్థాలు

ఒకరి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 6: నామక్కల్ జిల్లా సేందమంగళం సమీపంలోని ముంబట్టి పట్టణ పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ పాఠశాలకు చెందిన వంట గది గోడలకు మానవ వ్యర్థాలను పూసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ పాఠశాలలో 124 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి అల్పాహార, మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు పాఠశాల ఆవరణలోనే వంట గది ఉంది. ఈ గది గోడలకు మానవ వ్యర్థాలను గుర్తు తెలియని వ్యక్తులు పూసిన విషయాన్ని గమనించిన హెడ్మాస్టర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి.. ఎరుంబట్టి అంబేద్కర్ నగర్‌కు చెందిన దురైమురుగన్ (26)ని అరెస్టు చేశారు.

పదో తరగతి విద్యార్థినితో కాపురం

17 యేళ్ల బాలుడిపై పోక్సో కేసు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): 15 యేళ్ల బాలికను రహస్యంగా ప్రేమవివాహం చేసుకుని కాపురం చేస్తున్న 17 యేళ్ల బాలుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికకు 17 యేళ్ల బాలుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా ప్రేమగామారింది. ఈ నెల 3న ఆలయంలో ఇరువురూ రహస్యంగా వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత బాలుడి అవ్వ ఇంట్లో కాపురం పెట్టారు. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి వెళ్లిన తమ కుమార్తె కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి దర్యాప్తులో ఈ ప్రేమ వివాహం గుట్టు రట్టయ్యింది. పోలీసులు తమ వద్దకు వస్తున్నారని తెలుసుకున్న ఆ జంట చెన్నైకి తిరిగొచ్చి పోలీసుల ఎదుట లొంగిపోయింది. బాలికను వివాహం చేసుకున్న బాలుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

జోరుగా చవితి కొనుగోళ్లు


గులాబీలు

సహకార దుకాణాల్లో కుడుముల తయారీ వస్తువులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న అరటి గెలలు
కోయంబేడు మార్కెట్ వద్ద విక్రయానికి సిద్ధంగా చెరకు గడలు
కోయంబేడు మార్కెట్‌కు లారీలో వచ్చిన బత్తాయిలు
తోరణాలు, గరిక, మామిడాకులు విక్రయిస్తున్న మహిళ
రంగురంగుల బొజ్జగణపయ్య ప్రతిమలు
అరటి పిలకలు, తోరణాలు అమ్ముతున్న మహిళ
అమ్మకానికి సిద్ధంగా ఉన్న జిల్లేడుపువ్వుల మాలలు
కోయంబేడు మార్కెట్‌లో రద్దీ
కాగితపు గొడుగులు విక్రయిస్తున్న మహిళ

వినాయక చవితి వేడుకలను వైభవంగా జరుపుకునేందుకు ప్రజలంతా సిద్ధమవుతున్నారు. చెన్నైలోని వినాయక ఆలయాలన్నీ చవితికి ముస్తాబవుతున్నాయి. నగరవాసులు బంకమట్టితో చేసిన చిన్న సైజు వినాయక ప్రతిమలను, రంగుల పెయింట్ చేసిన ప్రతిమలను కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. నగరవ్యాప్తంగా పలు చోట్ల వినాయక ప్రతిమల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొసపేటలో ప్రతిమలను అత్యధికంగా విక్రయిస్తున్నారు. ఇళ్లలో మొక్కేందుకు, వీధుల్లో ఏర్పాటు చేసేందుకు వివిధ సైజుల్లో ప్రతిమలు అందుబాటులో ఉంచారు. రూ.30 నుంచి రూ.30వేల వరకు పలుకుతున్నాయి. గత యేడాదికంటే వినాయక ప్రతిమల ధరలు పెరిగాయి. ఇదే విధంగా మైలాపూరు, తిరువొత్తియూరు, తాంబరం, ముడిచ్చూరు, రెడ్‌హిల్స్, పొన్నేరి తదితర ప్రాంతాల్లో వందల సంఖ్యలో విగ్రహాలు విక్రయిస్తున్నారు. చవితి సందర్భంగా అన్ని మార్కెట్లలో పూల ధరలు విపరీతంగా పెరిగాయి. కోయంబేడు మార్కెట్‌లో చామంతి, గులాబీలు, పన్నీర్‌గులాబీలు, సంపెంగ, మల్లె వంటి పూల దుకాణాల వద్ద శుక్రవారం ఉదయం నుంచే కొనుగోలుదారుల రద్దీ పెరిగింది. - చెన్నై, ఆంధ్రజ్యోతి

పూజాసామగ్రి...

ఇదే విధంగా చవితికి పూజా సామగ్రి కొనేందుకు నగరవాసులు దుకాణాలకు పోటెత్తారు. కోయంబేడు మార్కెట్‌లో జామపండ్లు, ఆపిల్ పండ్లు, వెలగపండ్లు, అరటిపండ్లు టన్నుల కొద్దీ దిగాయి. మైలాపూరు, పురుషవాక్కం, తిరువొత్తియూరు, పల్లావరం, తాంబరం తదితర ప్రాంతాల్లోని మార్కెట్లలోను చవితి పూజా సామగ్రి కొనుగోళ్లు జోరుగా జరుగుతున్నాయి. మామిడాకులు, తోరణాలు, గరిక కట్టలు, జిల్లేడు పూల మాలలు, రుద్రాక్షమాలలు, పూలసరాలను జోరుగా విక్రయిస్తున్నారు. ట్రిప్లికేన్ నగర సహకార సంఘం(టీయూసీఎస్), కాంచీపురం సహకార వస్తువుల సంఘం నడుపుతున్న దుకాణాల్లో కుడుములు తయారు చేయడానికి అవసరమైన బెల్లం, బియ్యంపిండి, తదితర కిరాణా సరుకుల సంచులను విక్రయిస్తున్నారు. టీయూసీఎస్ సంఘం కామధేను దుకాణాల్లో రూ.199కు రూ.500 గ్రాముల బెల్లం, 500 గ్రాములు బియ్యంపిండి, 250 గ్రాముల ముడి శనగలు, రూ.50.మి.లీ. నెయ్యి, 100 గ్రాముల సగ్గ బియ్యం, 5 గ్రాముల ఏలకులు, 10 గ్రాముల ఎండుద్రాక్ష, 10 గ్రాముల జీడిపప్పు, 85 గ్రాముల సేమియా, 50 గ్రాముల నువ్వులు ఉన్న సంచులను విక్రయిస్తున్నారు. కాంచీపురం జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో 20 దుకాణాల్లో, 402 రేషన్‌షాపులలోను 12 రకాల కిరాణా సరుకులు కలిగిన సంచులను రూ.299, రూ.399, రూ.499కు విక్రయిస్తున్నారు.

చెరకు గడలు..

వినాయకుడికి అత్యంత ప్రీతికరమైన చెరకు గడలను కూడా నగరవాసులు మార్కెట్లలో పోటీపడి కొనుగోలు చేస్తున్నారు. పూజ గదుల విస్తీర్ణాన్ని బట్టి పూర్తి చెరకు గడలను, సగం సైజు గడలను కొనుగోలు చేశారు. వడపళని, చింతాద్రిపేట, రాయపేట, మైలాపూరు, మందవెల్లి, టి.నగర్, ట్రిప్లికేన్, అయనవరం, పెరంబూరు తదితర ప్రాంతాల్లో వినాయకచవితి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మార్కెట్లలో చవితి సామగ్రి కొనేందుకు మహిళలు బారులు తీరారు.

టాలీవుడ్ వైపు శంకర్ కుమార్తె దృష్టి


అదితి శంకర్

చిత్రజ్యోతి

సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.శంకర్ వారసురాలిగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన అదితి శంకర్ హీరోయిన్‌గా పలు తమిళ చిత్రాల్లో నటించారు. ఇపుడు టాలీవుడ్‌వైపు ఆమె దృష్టి సారించారు. తెలుగు హీరో బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయుకుడిగా తెరకెక్కే చిత్రంలో అదితిని హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు కోలీవుడ్ సమాచారం. అదితి ఇప్పటికే పలు తమిళ చిత్రాల్లో నటించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. వైద్య విద్యను అభ్యసించిన అదితి శంకర్... హీరో కార్తీ నటించిన 'విరుమన్' ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత శివకార్తికేయన్ నటించిన 'మావీరన్'లో నటించారు. ప్రస్తుతం ఆమె విష్ణువర్ధన్ దర్శకత్వంలో ఆకాష్ మురళి హీరోగా నటించే 'నేసిప్పాయా' సినిమాలో నటించారు. ఆ తర్వాత అర్జున్ దాస్ హీరోగా నటించే మరో చిత్రంలో కూడా ఆమె నటించనున్నారు. ఇపుడు తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. తెలుగులో అనర్గళంగా మాట్లాడగల అదితిని టాలీవుడ్ ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిద్దాం.



గ్లామర్ పాత్రలు చేయను

● ప్రియా భవానీ శంకర్

మోడ్రన్ దుస్తులు ధరించి గ్లామర్ పాత్రల్లో నటించనని హీరోయిన్ ప్రియా భవానీ శంకర్ స్పష్టం చేశారు. ఎక్స్‌పోజింగ్ చేయడాన్ని తన అభిమానులు ఏమాత్రం ఇష్టపడరని ఆమె వ్యాఖ్యానించారు. బుల్లితెర యాంకర్ నుంచి హీరోయిన్ స్థాయికి చేరుకున్న ప్రియా భవానీ శంకర్ తమిళ, తెలుగు చిత్రపరిశ్రమలో ప్రముఖ హీరోయిన్‌గా రాణిస్తున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. 'మోడ్రన్ దుస్తులు ధరించి నటించడం వల్ల చిత్రపరిశ్రమలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్న ప్రచారాన్ని అంగీకరించను. మోడ్రన్ దుస్తుల్లో నటించడమే ఎంతో సవాల్‌తో కూడుకున్న పని. అలాంటి దుస్తులను నేను ధరించను. ప్రస్తుతం నేను చేస్తున్న పాత్రలు, ధరిస్తున్న దస్తులు ఎంతో సౌకర్యవంతంగా ఉన్నాయి' అని ఆమె వ్యాఖ్యానించారు.

'జాలియో జింఖానా' అంటున్న ప్రభుదేవా


'జాలియో జింఖానా'లో ఓ దృశ్యం

శక్తి చిదంబరం దర్శకత్వంలో ప్రభుదేవా, యోగిబాబు, మడోన్నా సెబాస్టియన్, అభిరామి, ఎంఎస్ భాస్కర్ తదితరులు నటించిన చిత్రం 'జాలియో జింఖానా'. అశ్విన్ వినాయకమూర్తి సంగీతం సమకూర్చిన ఈ చిత్రం ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేశారు. ఇందులో ప్రభుదేవా శవంగా నటిస్తుండడం గమనార్హం. ఆ మృతదేహం నలుగురు మహిళల చేతిలో చిక్కుకున్న నేపథ్యంలో ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ చిత్ర స్టోరీ. పూర్తిస్థాయి హాస్య భరిత చిత్రంగా రూపొందించిన ఈ చిత్రంలో ప్రభుదేవా ఎందుకు చనిపోయారన్నది అమిత ఆసక్తికరంగా సాగుతుంది. ఇందులో ప్రముఖ హాస్య నటుడు యోగిబాబు చర్చి ఫాదర్‌గా కనిపిస్తున్నారు. 'మగళిర్ మట్టుం'లో నగేష్ శవం పాత్రలో నటించారు. ఇప్పుడు ప్రభుదేవా కూడా అలాగే నటించినట్టు ట్రైలర్ చూస్తుంటే తెలుస్తోంది. నిర్మాత అశ్విన్ వినాయగమూర్తి.


కొత్త దంపతులు

ఇంటివాడైన 'డాన్' దర్శకుడు

శివకార్తికేయన్ హీరోగా నటించిన 'డాన్' హిట్ చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు సిబి చక్రవర్తి ఇంటివాడయ్యారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌శ్రీవర్షిణిని ఆయన వివాహం చేసుకున్నారు. వీరి వివాహం ఈరోడ్‌లోని ఆర్‌ఎన్ పుదూరులో జరిగింది. ఈ వివాహ శుభకార్యంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకకు హాజరైన సినీ ప్రముఖుల్లో శివకార్తికేయన్, ఎస్‌జే సూర్య, దర్శకులు రవికుమార్, భాగ్యరాజ్ కన్నన్, అట్లీ, విఘ్నేష్ రాజా, విశాల్ వెంకట్, నటుడు దర్శన్, గేయ రచయిత వివేక్, నిర్మాతలు సుధన్, లైకా ప్రొడక్షన్స్ హెడ్ జీకేఎం తమిళ్ కుమరన్, ఎస్‌కే ప్రొడక్షన్స్ కలై, నిర్మాత శాంతి టాకీస్ అరుణ్, మునీష్‌కాంత్, బిగ్‌బాస్ రాజు, నటులు బాల శరవణన్, కాళీవెంకట్, మిర్చి విజయ్, శివాంగి తదితరులు ఉన్నారు. కాగా సిబి చక్రవర్తి దర్శకత్వంలో వచ్చిన 'డాన్'లో హీరో శివకార్తికేయన్ సినీ కెరీర్‌లో ది బెస్ట్ మూవీగా నిలవడమేకాకుండా, రూ.100 కోట్లకుపైగా వసూళ్లను రాబట్టిన విషయం తెల్సిందే.

ఎస్‌ఎంఎఫ్‌జీ స్మారక స్టాంపు ఆవిష్కరణ


స్టాంపు, కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎంఎఫ్‌జీ సీఈఓ శాంతను మిత్రా తదితరులు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ రంగంలో పేరుగడించిన ఎస్‌ఎంఎఫ్‌జీ ఇండియా క్రెడిట్ సంస్థ ముంబైలో 1000వ శాఖను ప్రారంభించిన సందర్భంగా ప్రత్యేక స్టాంపు, కవర్‌ను ఆ సంస్థ సీఈఓ శాంతను మిత్రా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముంబైలోని జపాన్ రాయబారి యాగి కొజి, పోస్టల్ సర్వీస్ డైరెక్టర్ అభిజీబాన్‌సోడి తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగుల సంరక్షణకు తీసుకున్న చర్యలేంటి?

● సర్కారును ప్రశ్నించిన హైకోర్టు



అడయార్, సెప్టెంబరు 6: రాష్ట్రవ్యాప్తంగా వీధులు, రహదారుల్లో సంచరిస్తున్న మానసిక రోగుల సంరక్షణ, వారికి వైద్య చికిత్సలు అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని మద్రాస్ హైకోర్టు ప్రశ్నిస్తూనే ఈ అంశాలపై సమగ్ర నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా పలువురు మానసిక రోగులు రోడ్లపై సంచరిస్తున్నారని, వారందరినీ రక్షించి, వారికి అవసరమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ నాగపట్టినానికి చెందిన కేవీ రాజేంద్రన్ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఉప్పు బస్తాల లారీల్లో...

నాగపట్టినం జిల్లా వేదారణ్యం నుంచి ఉప్పు బస్తాలను తీసుకెళ్లేందుకు వచ్చే లారీల్లో ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తమిళనాడుకు పలువురు మానసిక రోగులు ప్రవేశిస్తున్నారు. వీరంతా రోడ్లు, వీధుల్లో సంచారం చేస్తున్నారు. ఇలాంటి వారందరినీ రక్షించి తగిన వైద్యం చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఈ విషయంపై 2009లో మద్రాస్ హైకోర్టు పలు సూచనలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా నాగపట్టినం జిల్లాలో సంచరిస్తున్న మానసిక రోగులను రక్షించి, వారికి తగిన వైద్యం చేయించి రక్షణ కల్పించాలని కలెక్టర్, ఎస్పీలకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. కానీ, ఎలాంటి స్పందన లేదు. అందువల్ల మానసిక రోగుల సంక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్, జస్టిస్ బాలాజీలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపి... రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మానసిక రోగులను రక్షించి, వారి సంరక్షణకు జిల్లాల వారీగా ప్రభుత్వం చేపట్టిన, తీసుకున్న చర్యలు ఏంటో తెలుపాలని ఆదేశిస్తూ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వావూసీకి ఘననివాళి


శరవణరాజ్‌కు వావూసీ పురస్కారం అందజేస్తున్న పేరవై నిర్వాహకులు

పెరంబూర్, సెప్టెంబరు 6: స్వాతంత్ర్య సమరయోధుడు వావూ చిదంబరనాథ్ 153 జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వావూసీ పేరవై ఆధ్వర్యంలో స్థానిక పల్లావరం సమీపం పమ్మల్‌లో జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన పారిశ్రామికవేత్త లయన్ పీఆర్‌ఎస్ శరవణరాజ్‌కు 2024వ ఏడాది వావూసీ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పేరవై జిల్లా అధ్యక్షులు వేలు పిళ్లై, కార్యదర్శి గౌతమన్ తదితరులు పాల్గొన్నారు.


వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు


రాష్ట్రస్థాయి విజేతలు మాలినా, ఆపేక్ష, ప్రకృతి, అక్షిత, భవ్య

ఫెమీనా మిస్ ఇండియా రాష్ట్ర విజేత మాలినా

చెన్నై,సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి):ఫెమినా మిస్ ఇండియా2024, టాప్స్ అండ్ రజనీగంధ పెర్ల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అందాల పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతల జాబితాను ప్రకటించింది. ఆమేరకు తమిళనాడుకు చెందిన మాలినా, కర్నాటకు చెందిన ఆపేక్ష, తెలంగాణాకు చెందిన ప్రకృతి, కేరళకు చెందిన అక్షిత, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భవ్యా విజేతలుగా ఎంపికైనట్లు సంస్థ నిర్వాహకులు ప్రకటించారు. ఇదేవిధంగా ఆయుషి (గుజరాత్), హర్ష (మహారాష్ట్ర), వైష్ణవి (రాజస్థాన్), అతిధి (బిహార్), రియా (జార్ఖండ్), డాలీ (పశ్చిమబెంగాల్), విశాఖ (చత్తీస్‌ఘర్), అనన్య (ఒడిశా) ఆయా రాష్ట్రాల విజేతలుగా ఎంపికైనట్లు తెలిపారు.


చెన్నై తేనాంపేటలోని వ్యాధి నిరోధక వైద్య విభాగంలో ప్రయోగశాల పనితీరును శుక్రవారం పరిశీలిస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం